ప్రజాశక్తి

గురువారం 14 ఆగష్టు 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల





పొగాకు వేలంలో..

దోపిడీ తీవ్రం

- రోజురోజుకూ పెరుగుతున్న తిరస్కరణలు
- మార్కెట్ వైపు చూడటం మానేసిన పాలకపక్షం
- మార్క్‌ఫెడ్ ప్రత్యామ్నాయం అంటున్నా పట్టించుకోని వైనం



పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న మంత్రి స్వామి (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వర్జీనియా పొగాకు వేలం కేంద్రాల్లో రోజురోజుకూ దోపిడీ పెరుగుతోంది. వ్యాపారుల ఇష్టారాజ్యమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వ్యాపారులు కొనడానికి ముందుకు రానందున బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు 2లో

ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్

కాలువ మలుపునకు అనుమతి

3లో

అమెరికా సుంకాల భారం నుంచి

ఆక్వా రైతులను ఆదుకోవాలి

3లో

హై అలర్ట్

- బాపట్ల జిల్లాఅంతటా భారీ వర్షాలు
- నేడు పాఠశాలలకు సెలవు
- జిల్లాలో 38 వేల ఎకరాల్లో వరి పైరు మునక
- చుండూరు మండలంలో అత్యధికంగా 272.4 మి.మీ.ల వర్షపాతం నమోదు



బాపట్లలో నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

భారీ వర్షాలు, వరదల హెచ్చరికల నేపథ్యంలో బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి జిల్లాలో హైఅలర్ట్ ప్రకటించారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందే విధంగా కంట్రోల్‌రూమ్స్ ఏర్పాటు చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాఅంతటా భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని చుండూరు మండలంలో అత్యధికంగా 272.4 మి.మీ.లు వర్షపాతం నమోదయ్యింది. నిన్నటివరకు వర్షాల కోసం రైతులు ఎదురుచూడగా.. ఒక్కసారిగా జిల్లాలోని అన్ని మండలాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో కొన్ని ప్రాంతాల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఇప్పటివరకు రెండున్నర లక్షల ఎకరాల్లో వరి, వేరుశనగ, కంది, మినుము పంటలు సాగు చేశారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు కర్లపాలెం, కొల్లూరు, అమర్తలూరు, బాపట్ల, చుండూరు, రేపల్లె, చెరుకుపల్లి మండలాల పరిధిలో 38 వేల ఎకరాల్లో సాగు చేసిన వరి పైరు నీట మునిగినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనాలు వేశారు. పంట పొలాల నుంచి వరద నీరు బయటకు వెళ్లేలా రైతులు కాలువలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం.సుబ్రమణ్యేశ్వరరావు తెలిపారు. బాపట్ల మండలంలోని కంకటపాలెం, జమ్ములపాలెం గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ పరిశీలించారు.

– వాతావరణ పరిస్థితుల 2లో

ప్రజల ఆందోళనలు అణచాలని చూస్తే..

ప్రజాగ్రహం తప్పదు..

- రైతు నాయకుల హెచ్చరిక
- క్విట్ కార్పొరేట్-క్విట్ అగ్రికల్చర్ ర్యాలీని అడ్డుకున్న పోలీసులు..
- పోలీస్, ప్రభుత్వ చర్యలపై ఎస్‌కెఎం, రైతుసంఘాల తీవ్ర నిరసన



ధర్నా చేస్తున్న సంఘాల నాయకులు, రైతులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రజాందోళనలను అధికార బలంతో అణచివేయాలని చూస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని పలువురు నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శాంతియుతంగా రైతాంగ సమస్యపై చేపట్టిన క్విట్ కార్పొరేట్ – క్విట్ అగ్రికల్చర్ ప్రదర్శనను 30 యాక్ట్ పేరున పోలీస్ అధికారులు అడ్డుకోవడం పట్ల నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బుధ



ర్యాలీని అడ్డుకొనేందుకు వచ్చిన పోలీసులు

వారం నాడు సంయుక్త కిసాన్ మోర్చా మరియు ట్రేడ్ యూనియన్ ఐక్య వేదిక ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రదర్శనకు ముందస్తు అనుమతి లేదన్న సాకుతో పోలీసులు అడ్డుకున్నారు. అధికార పార్టీ కార్యక్రమాలకు ఒక చట్టం, ప్రతిపక్షాలకు ఒక చట్టమా.? అని పలువురు ప్రశ్నించారు. జాతీయ 2లో



మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ శక్తులు

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు

3లో

పొగాకు వేలంలో.. దోపిడీ తీవ్రం

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారు. ఇక్కడ తక్కువ ధరలకైనా వ్యాపారులు కొంటున్నారు. దీంతో వర్జీనియా పొగాకు విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా పట్టించుకోవడం లేదు. ఇక్కడ పోటీ లేనందున దోపిడీ కొనసాగుతోంది. వ్యాపారులపై ఒత్తిడి లేదు. నియంత్రణ అంతకన్నా లేదు. మొదట్లో ఏదో పట్టించుకున్నట్లు వ్యవహారం నడిపిన పాలకపక్ష నేతలు ఇప్పుడు కేంద్రాల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. వేలం కేంద్రాల్లో ఏం జరుగుతుందో కూడా ఆలోచించడం లేదు. ఇంకా చెప్పాలంటే పొగాకు వ్యవహారం మనది కాదన్నట్లుగా వదిలేశారు. దీంతో వేలంలో వ్యాపారుల దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. అంతా మౌనం దాల్చారు. వేలంలో పోటీని పెంచాలని ఆరంభం నుంచీ రైతులు చెబుతున్నారు. ఇంత వరకూ ఆ దిశగా చర్యలు లేవు. వ్యాపారులు సిండికేట్‌గా మారారు. మొదటి నుంచీ ఇప్పటికీ అదే ధర ఇస్తున్నారు. కనీసం గతేడాది ధరలు కూడా రాలేదు. పైగా ఈ ఏడాది పెట్టుబడులు పెరిగాయి. అందరూ నష్టపోక తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సగటు ధర కూడా పడిపోతోంది. ఇప్పటివరకూ ప్రకాశం రీజియన్ పరిధిలో అంటే ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కలిపి సుమారు 86 మిలియన్ కిలోల పొగాకు కొనుగోళ్లు జరిగాయి. సగటు ధర చూస్తే ఎస్‌ఎల్‌ఎస్‌లో రూ.240 ఉండగా ఎస్‌బిఎస్‌లో రూ.237.89 ఉంది. ఈ ధర రోజురోజుకూ దిగజారుతోంది. సగటు ధర వేలం ప్రారంభంలో రూ.280 ఉంది. ఇప్పుడు కిలోకు రూ.40 తగ్గింది. సగటు ధర ఎంత తగ్గిందో రైతులకు తెలియకుండానే వ్యాపారులంతా మోసం చేసినట్లుగా భావించాలి. పైకి మాత్రం గరిష్ట ధర రూ.280 ఉంటుంది. ఈ ధర ఎంత మంది రైతులకు ఇస్తున్నారంటే చాలా స్వల్పంగానే ఇస్తున్న పరిస్థితి. ఇక తిరస్కరణలు 25 నుంచీ 28 శాతానికి పైగా ఉంటున్నాయి. నిత్యం ఇదే పరిస్థితి. వందలాది బేళ్లను ఇళ్లకు తరలిస్తున్నారు. నాలుగో వంతు బేళ్లు కొనడం లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఆలోచించాలి. ఇక రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వదిలేసింది. సిఎం చంద్రబాబు ఈ నెల 2న జిల్లాకు వచ్చారు. కనీసం ఆయన దృష్టికి కూడా పొగాకు రైతుల సమస్యలు తీసుకొని పోయే యత్నం ఎవరూ చేయలేదు. పైగా ఆయన వచ్చిన పర్యటన కూడా అన్నదాత సుఖీభవ కార్యక్రమానికే.. అసలు పొగాకు రైతులు సంతృప్తిగా ఉన్నారా? అనే ఆలోచన కూడా చేయలేదు. అధికారంలో లేనప్పుడు మాత్రం అన్నీ గుర్తుంటాయి. ఇప్పుడు మాత్రం ఏదీ గుర్తుండదు. వైసిపి అధినేత జగన్ పొదిలి పర్యటించారు. ఆయన పర్యటన సందర్భంగా ఆ పార్టీ నేతలపై కేసులపై చూపిన శ్రద్ధ పొగాకు రైతులపై చూపినా ఫలితం ఉండేది. మంత్రులు, ఎమ్మెల్యేలు అప్పుడు పోటాపోటీగా కేంద్రాలను సందర్శించారు. ఇప్పుడు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇక కేంద్ర ప్రభుత్వం కూడా పట్టించుకోలేదు. ఈ వారంలోనే బిజెపి రాష్ట్ర నేతలందరూ ఒంగోలులో పర్యటించారు. పొగాకు రైతుల సమస్య ఆ పార్టీ నేతలకూ పట్టలేదు. కొనుగోళ్లు కూడా చివరి దశకు వస్తున్నాయి. ఇప్పుడు లోగ్రేడ్ వస్తోంది. దీని ధరలు మరీ తక్కువగా ఉంటున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలి. మంత్రులూ పొగాకు వేలం గురించి ఆలోచించాలి. ఆఖరులోనైనా ప్రభుత్వ రంగ సంస్థను దించితే ఎంతోకొంత మేలు జరిగే అవకాశం ఉంది.

హై అలర్ట్..

(మొదటిపేజీ తరువాయి)


దృష్ట్యా బాపట్ల జిల్లా కలెక్టర్ ఆదేశాలను అనుసరించి బాపట్ల జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటించినట్లు డిఇఒ ఒక ప్రకటనలో తెలిపారు.

కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు

భారీ వర్షాలు, వరదల హెచ్చరికల నేపథ్యంలో బాపట్ల జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి జిల్లాలో హై అలెర్ట్ ప్రకటించి.. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందే విధంగా కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేశారు. అధిక వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ సిబ్బందికి సెలవులు రద్దు చేశారు. అందరూ విధుల్లో ఉండాలని ఆదేశించారు.

కంట్రోల్ రూమ్ నెంబర్లు:

బాపట్ల కలెక్టరేట్ కంట్రోల్ రూమ్: టోల్ ఫ్రీ :1077,
సెల్: 9711077372
రేపల్లె ఆర్డీవో కంట్రోల్ రూమ్: సెల్: 8648293795
కొల్లూరు ఎంఆర్వో, కంట్రోల్ రూమ్: సెల్ : 7794894544
భట్టిప్రోలు ఎంఆర్వో, కంట్రోల్ రూమ్: సెల్ : 83319 13995, 8712655931



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

వధూవరులకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆశీర్వాదం

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ నాయకులు గంగనపల్లి శ్రీనివాసులు (నంది శ్రీను) కుమార్తె కృష్ణ ప్రియాంక వివాహం కిషోర్ కుమార్‌తో బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. పట్టణంలోని నరవ రోడ్డులో శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో అంగరంగ వైభవంగా ఏర్పాటు చేసిన పెళ్లి పందిరిలో వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. వివాహ వేడుకకు స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, ముత్తుముల కృష్ణ కిషోర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు భారీగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ప్రజాగ్రహం తప్పదు

(మొదటిపేజీ తరువాయి)

సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు సంఘ జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, ఏపి రైతు సంఘం, అఖిలభారత రైతుకూలి సంఘం, కిసాన్ కాంగ్రెస్, సిపిఎం, కాంగ్రెస్ పార్టీ, పలు ప్రజాసంఘాల నేతలు ట్రాక్టర్లు, మోటార్‌బైకులు, జెండాలతో ప్రదర్శన చేపట్టడానికి బుధవారం ఉదయం పది గంటలకు మినీ స్టేడియంకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న సీఐలు వై నాగరాజు, ఎం విజయకష్ణ, ఎం శ్రీనివాసరావు పోలీస్ సిబ్బందితో మినీ స్టేడియం వద్దకు చేరుకొని ప్రదర్శనను అడ్డుకున్నారు. జిల్లాలో 30 యాక్ట్ అమలు ఉన్నందున ముందస్తు అనుమతి పొందాలని ప్రకటించారు. సమయభావం వల్ల అనుమతి పొందలేక పోయామని రైతు సమస్యలపై శాంతియుతంగా చేపట్టే ర్యాలీకి అనుమతించాలని కన్వీనర్ రంగారావు విజ్ఞప్తి చేశారు. ప్రదర్శనకు అనుమతించేది లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే ట్రాక్టర్లు ఇతర వాహనాలు సీజ్ చేస్తామని, నిరసనకారులను అరెస్ట్ చేస్తామని పోలీసులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రైతు నాయకులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ధర్నాకు చుండూరు రంగారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2018లో ఇచ్చిన వ్యవసాయ హామీల అమలుకు చేపట్టిన ప్రదర్శనను పోలీసులు అడ్డుకోవడం దుశ్చర్యగా పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై, రైతాంగ సమస్యలపై ప్రజాస్వామ్య యుతంగా ఆందోళన కార్యక్రమాలను అడ్డగించటం దుర్మార్గమన్నారు. చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నేతగా అరెస్ట్ అయినప్పుడు ప్రజాస్వామ్యయుతంగా ఘటనను ఖండించింది తామేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ రైతాంగం పండిన పంటకు గిట్టుబాటు ధర లభించక ఆత్మహత్యలకు పాల్పడుతుంటే గుడ్డి ప్రభుత్వం కళ్లప్పగించి చోద్యం చూస్తోందని దుయ్యబట్టారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని కోరుతూ శాంతియుతంగా ప్రదర్శన చేపట్టిన తమపై పోలీసు యంత్రాంగాన్ని ప్రయోగించి.. ఉద్యమాలను అణచివేయాలని ప్రయత్నం చేస్తే గత ప్రభుత్వాలకు పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు.

రైతు సంఘం జిల్లా అధ్యక్షులు(మల్లయ్య లింగం భవన్) హనుమారెడ్డి మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్ ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని దుయ్యబట్టారు. అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని కాపాడవలసిన ప్రభుత్వాలు కార్పొరేట్లకు అప్పగించటం దుర్మార్గమన్నారు. రైతు కూలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె లలితకుమారి, ఎమ్మెస్ సాయి మాట్లాడుతూ 32 మంది ఆత్మాహుతితో సాధించిన ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ పరం చేయటం పట్ల తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేశారు. కిసాన్ కాంగ్రెస్ నాయకులు కొండ్రగుంట సుబ్బారావు మాట్లాడుతూ దేశ ప్రజలకు ఆహార భద్రత కల్పిస్తున్న రైతాంగాన్ని నిర్లక్ష్యం చేయడం కేంద్ర ప్రభుత్వానికి తగదని హితవు పలికారు.

రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుజ్జూరు జయంతిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోపే వచ్చిన ప్రజాగ్రహం తట్టుకోలేని చంద్రబాబు ప్రజలపై దమనకాండను ప్రదర్శిస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్‌కె.సైదా మాట్లాడుతూ అధికార పార్టీ చేపట్టే కార్యకలాపాలకు 30 యాక్ట్ వర్తించదా.? అని ప్రశ్నించారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు మాట్లాడుతూ దేశం అత్యంత ప్రమాదకరమైన పరిస్థితిని ఎదుర్కొంటుందని, నేరస్తులకు దుర్మార్గులకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వం ప్రజల పక్షాన నిలిచే ప్రజాస్వామ్యవాదులపై ఉక్కుపాగతం మోపుతోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకులు సుబ్బారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇరిగినేని వెంకట నరసయ్య, రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు అబ్బూరి వెంకటేశ్వర్లు బెజవాడ శ్రీనివాసరావు, టి శ్రీకాంత్, కనపర్తి సుబ్బారావు, సిఐటియు నాయకులు రమేష్, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



పదవీ బాధ్యతలు చేపట్టిన పిఎసిఎస్ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

రాచర్ల పిఎసిఎస్ చైర్ పర్సన్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ చైర్ పర్సన్‌గా గోపిరెడ్డి జీవనేశ్వరరెడ్డి, సభ్యులుగా బత్తిని రాజశేఖర్, గువ్వా పిచ్చయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని సొసైటీ కమిటీ సభ్యులకు పూలమాల శాలువాలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. తమను గుర్తించి పదవీ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి నూతన కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కటికే యోగానంద్, గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, గిద్దలూరు పిఎసిఎస్ చైర్‌పర్సన్ దుత్తా బాల ఈశ్వరయ్య, టిడిపి నాయకులు అంబవరం శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ శక్తులు

ఉపాధి హామీ కూలీలకు రూ.600 వేతనం ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు



నిధులు సేకరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-పీసీపల్లి, కనిగిరి

భారతదేశం వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ శక్తులు ప్రవేశించాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు రెండో రోజు బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ వ్యవసారంగాన్ని పూర్తిగా హస్తగతం చేసుకునేందుకు కార్పొరేట్ వ్యక్తులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని, అందుకు మోడీ ప్రభుత్వం కూడా సహకరిస్తుందన్నారు. అందువలన వ్యవసాయ కూలీలకు ఉపాధి అవకాశాలు తగ్గుతుందన్నారు. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడి తగ్గిపోవడం వలన, రైతులకు గిట్టుబాటు ధర లేక, అప్పులు పెరిగి, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం 2.5 లక్షల కోట్ల రూపాయలు కార్పొరేటర్ శక్తులకు బడా పెట్టుబడిదారులకు ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తుందన్నారు. ఈ భారాన్ని వసూలు చేసేందుకు ప్రజల మీద పనుల భారం మోపుతుందన్నారు. భారతదేశంలో 15 కోట్ల మంది ప్రజలకు జాబ్ కార్డు కలిగి ఉపాధి హామీ పనులకు వెళుతున్నారని తెలిపారు. 2006వ సంవత్సరంలో ఆ పథకం ప్రవేశపెట్టినప్పుడు సంవత్సరానికి 100 రోజులు పని దినాలు ఉన్నాయన్నారు. వ్యవసాయ రంగంలో పనులు తగ్గిపోవడం మూలంగా, వ్యవసాయ కూలీలు పను లు లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. అందువలన సంవత్సరానికి 200 రోజులు పని దినాలు పెంచాలని ఆయన ప్రభుత్వం డిమాండ్ చేశారు. ప్రస్తుతం ధరలు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీలకు రోజుకి రూ.6 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పనుల్లేని రోజుల్లో ఉపాధి కూలీలకు నెలకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి యువ తకు రూ.3 వేలు చెల్లించాలని తెలిపారు. పనులు లేక అవస్థలు పడుతున్న వారికి, పనైనా చూపాలి, అన్నమైన పెట్టాలన్నారు. ఆకల చావులను అరికట్టాలని ఆయన కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అదాని అంబానీలకు కార్పొరేట్ వ్యక్తులకు సబ్సిడీలు ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలు పేదలను పట్టించుకోవటం లేదన్నారు. దళిత పేటలో గ్రంథాలయాలను ఏర్పాటు చేసి విద్యా వంతం చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా సీనియర్ నాయకులు జాలా అంజయ్య మాట్లాడుతూ సంఘాన్ని జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసి దళితులు సమస్యలపై సంఘం తరపున పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ అనేక దళితపేటలో స్మశానాలు లేక మృతదేహాలను వాగులు వంకల్లో పూడ్చిపెట్టే పరిస్థితి ఉందన్నారు. భూస్వాముల కంబంధ హస్తాల్లో ఉన్న ప్రభుత్వ భూములను పేదలకు దక్కేలా పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం దళితపేటలో స్మశానాలను ఏర్పాటు చేయాలన్నార. వ్యవసాయ కార్మికులకు రెండు ఎకరాలు భూమి ఇవ్వాలని, కనీస వేతన చట్టం అమలు చేయాలని, మహిళలు బాలికలపై జరుగుతున్న వేధింపులు అత్యాచా రాల నివారించి, భద్రత కల్పించాలని, మద్యం మహమ్మారి నుండి ప్రజలను కాపాడాలని, దళిత గిరిజన మైనరీటలపై జరిగే దాడులను అరికట్టాలని, ఫ్లోరైడ్ నివారణ చర్యలు తీసుకోవాలని, ఉపాధి హామీని పట్టణాలకు విస్తరింప చేయాలని, అర్హులందరికీ మూడు సెంట్లు ఇళ్లస్థలాలు ఇవ్వాలని, పక్కా గహాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలు ఇవ్వాలని, పొగాకు పచ్చాకు ముఠా కూలీలకు రక్షణ కల్పించాలని ఇలా 12 రకాల తీర్మానాలను కమిటీ సభ్యులు కేజీ మస్తాన్ ప్రవేశపెట్టగా మహాసభ ఆమోదించింది. మహాసభల ప్రాంగణం సునీత ప్రాంగణంలో జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి ఆంజనేయులు, గుమ్మా బాలనాగయ్య, మల్లెల సంపూర్ణ, ఉబ్బా వెంకటేశ్వర్లు, కంకణాలు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్యూబాకు సంఘీభావం నిధి

వ్యవసాయ కార్మిక సంఘం మహా సభల రెండో రోజు, బుధవారం క్యూబాకు సంఘీభావంగా కొంత నిధిని వసూలు చేసి రాష్ట్ర అధ్యక్షులు దాడాల సుబ్బారావుకు అందజేశారు. ప్రపంచంలో మానవత్వం విలువలను నిలబెడుతున్న క్యూబాను అణిచివేసేందుకు అమెరికా చేస్తున్న కుట్రలను ప్రతినిధులు నిరసించారు. సామ్రాజ్యవాదం నశించాలని, క్యూబాకు సంఘీభావాన్ని ప్రకటిద్దామని నినాదాలు చేశారు. నిధి వసూళ్ల కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు, జాలా అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

మరో నలుగురికి గాయాలు



కోటమ్మ మృతదేహం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, మరో నలుగురికి గాయాలైన సంఘటన మండలంలోని పేర్నమిట్ట చెరువు సమీపంలో ఒంగోలు- కర్నూలు రహదారిపై బుధవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. చీమకుర్తి నుంచి ప్రయాణికులతో ఆటో ఒంగోలు వెళ్తుండగా పేర్నమిట్ట చెరువు సమీపంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మంగమూరు రోడ్డుకు చెందిన పెంద్రా కోటమ్మ(65) అక్కడికక్కడే మృతి చెందగా, ఆటో డ్రైవర్ సిహెచ్ శ్రీనివాస రావు, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఒంగోలు తాలూకా పోలీసులు కోటమ్మ మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఒంగోలు తాలూకా సబ్ ఇన్స్పెక్టర్ హరిబాబు కేసు నమోదు చేశారు. ఆటో డ్రైవర్ శ్రీనివాసరావుతో పాటు గాయాలైన మరో ముగ్గురు ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి డాక్టర్ నాగరాజు

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి-మార్కాపురం

ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్న బాపిరెడ్డిపై రెండు రోజుల క్రితం ప్రత్యర్థి వర్గానికి చెందిన వెంగళరెడ్డి కళ్లలో కారం చల్లి ఇనుపరాడ్డుతో హత్యాయత్నానికి ఒడిగట్టాడు. మార్కాపురంలోని ఆర్‌టిసి బస్టాండులో బస్సులో గత రెండు రోజుల క్రితం ఈ సంఘటన జరిగిన విషయం తెలిసిందే. ఈ కేసును పోలీసులు 48 గంటల్లోనే ఛేదించారు. హత్యాయత్నానికి ఒడిగట్టిన వెంగళరెడ్డిని అరెస్ట్ చేశారు. కోర్టులో బుధవారం ప్రవేశపెట్టగా రిమాండ్ విధించారు. ఈ మేరకు స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి డాక్టర్ యు.నాగరాజు వివరాలు వెల్లడించారు. ముండ్లమూరు మండలంలోని ఈదర గ్రామానికి చెందిన బాపిరెడ్డి, వెంగళరెడ్డి కుటుంబాల మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో ఓ హత్య జరిగింది. ఈ హత్య కేసు మార్కాపురంలోని ఆరో అదనపు జిల్లా జడ్జి కోర్టులో విచారణలో ఉంది. ఆ కేసులో నిందితుడిగా ఉన్న బండి బాపిరెడ్డి వాయిదాకు హాజరు కాగా ప్రత్యర్థి వర్గానికి చెందిన క్రిష్టపాటి వెంగళరెడ్డి వెంబడిస్తూ బాపిరెడ్డిపై హత్యాయత్నానికి దిగాడు. జిల్లా ఎస్‌పి ఎఆర్ దామోదర్ ఆదేశాలతో, సలహాలతో నిందితుడు వెంగళరెడ్డిని చాకచక్యంగా 48 గంటల్లోనే అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచినట్లు డిఎస్‌పి నాగరాజు తెలిపారు. విలేకరుల సమావేశంలో మార్కాపురం సిఐ పి.సుబ్బారావు, మార్కాపురం పట్టణ ఎస్ఐ ఎం.సైదుబాబు, మార్కాపురం రూరల్ ఎస్ఐ పి.అంకమరావు పాల్గొన్నారు.

ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్

కాలువ మలుపునకు అనుమతి

రెండు గ్రూపుల ఆమోదంతో పనులు..

కలెక్టర్ జె.వెంకట మురళి

మత్స్యకారుల బోట్ల నిలుపుదలకు జట్టీ నిర్మాణం

స్ట్రయిట్ కట్ అభివృద్ధికి రూ.25 కోట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి, ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల, చీరాల మండలాల పరిధిలో ఉన్న ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ సముద్రంలో కలిసే ప్రదేశంలో ఏర్పడిన వంపు కాలువ ఆక్రమణకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గత కొంత కాలంగా మత్స్యకారులు ఆందోళన చేస్తున్న క్రమంలో స్ట్రయిట్‌కట్ కాలువ మలుపు సమస్య పరిష్కారం కోసం అధికారులు కసరత్తు చేశారు. ఈ మేరకు సదరు కాలువ మలుపుకు అనుమతిస్తూ, రెండు గ్రూపుల ఆమోదంతో పనులు చేపట్టాలని కలెక్టర్ జె. వెంకట మురళి మత్స్యశాఖ అధికారులకు సూచనలు చేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని వీక్షణ సమావేశ మందిరంలో ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ కాలువ మలుపు పరిష్కార దిశగా లైన్ డిపార్ట్మెంట్లు, రైతు, మత్స్యశాఖ సంఘ సభ్యులతో కలెక్టర్ జె.వెంకట మురళి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ రాజు, చీరాల శాసనసభ్యులు ఎం.మాలకొండయ్య, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తుషార్‌డూడి పాల్గొన్నారు.

ఈపురుపాలెం స్ట్రయిట్ కట్‌ను ఎగువప్రాంతంలోని వరదనీరు సముద్రంలోకి పంపడం కోసం 1971 దశకంలో నిర్మించారని తెలిపారు. ఈ స్ట్రయిట్‌కట్‌ను తదనంతర కాలంలో మత్స్యకారుల బోట్ల రాకపోకల కోసం, తుఫానుల సమయంలో బోట్లను నిలిపి ఉంచేందుకు వినియోగిస్తూ వచ్చినట్లు చెప్పారు. సముద్ర ముఖద్వారం వద్ద స్ట్రయిట్ కట్ మలుపు ఏర్పడిందని చెప్పారు. ఇక్కడ ఉన్న భూమిలో కొంత పట్టా భూమి, డీకే భూమి ఉందన్నారు. గతంలో అక్కడ భూములు విలువ లేకపోవడం వల్ల దానిని ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు భూమి రేట్లు పెరిగినందున.. ఆ ప్రాంతంలో టూరిజం పెరగటం వల్ల ఇప్పుడు ఈ సమస్య తలెత్తిందన్నారు. స్ట్రయిట్ కట్ మలుపు వద్ద రైతుకు చెందిన 49 సెంట్లు భూమి కొట్టుకుపోయిందని తెలిపారు. అడవి పాలెంలోని 7 గ్రామాలు, వాడరేవులోని 6 గ్రామాలు, 593 బోట్లతో 1,303 మత్స్యకార కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. ఏ విషయంలో అయినా సమస్యలు వస్తుంటాయని, వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు పోవాలన్నారు. దీనికి పరిష్కారంగా రైతులు, మత్స్యకారులను దష్టిలో పెట్టుకొని అక్కడ జెట్టి నిర్మాణానికి అనుమతి ఇస్తానని కలెక్టర్ తెలిపారు. కాలువను మలుపు తిప్పడంలో భూమి నష్టపోతున్న రైతుకు మత్స్యశాఖ వారు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపి ల్యాండ్ కొనుగోలు చేసి రైతు ఖాతాలో డబ్బులు జమ చేయాలన్నారు. డబ్బు ఏ రోజైతే రైతు ఖాతాలో జమవుతుందో ఆ రోజు నుంచి కాలువ వంపునకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రైతు ఖాతాలో డబ్బులు తర్వాత వచ్చినా పర్వాలేదని సమ్మతి తెలిపితే ఈరోజు నుండే పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈపురుపాలెం స్ట్రెయిట్ కట్ వద్ద శాశ్వత పరిష్కారం కోసం నిజాంపట్నంలో మాదిరిగా పెద్ద పెద్ద సిమెంటు దిమ్మెలను వేస్తూ, రెండు వైపులా రిటైనింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఆ రిటైనింగ్ కూడా శాస్త్రీయంగా తుఫాను గాలులు, సునామీలను తట్టుకునే విధంగా నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ నిర్మాణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుండి రూ 25 కోట్లు వస్తాయని మత్స్య శాఖ కమిషనర్ తెలిపారని చెప్పారు. ఈ మేరకు డిపిఆర్ తయారుచేసి ప్రభుత్వానికి ప్రతిపాదన పంపుతామన్నారు. ఆ ప్రతిపాదనలను బాపట్ల, చీరాల శాసనసభ్యులతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి దష్టికి తీసుకువెళ్లి వాటిని సాధిస్తామని చెప్పారు.

ఈ సందర్భంగా బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ ఈపురుపాలెం స్ట్రెయిట్ కట్ ద్వారా మత్స్యకారులు వారి జీవనోపాధిని కొనసాగించటానికి హక్కు ఉండే విధంగా ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు కూడా ఇబ్బంది పడకుండా ఎక్కడైతే అలలు ఎక్కువగా వస్తాయో అక్కడ సముద్రంలో నేరుగా కాకుండా వంపు తీసుకొని వెళ్లే విధంగా రైతుకు డబ్బు చెల్లించి స్థల సేకరణ జరపాలన్నారు.

చీరాల శాసనసభ్యులు ఎం.మాలమాలకొండయ్య మాట్లాడుతూ ప్రజల మధ్య వైవిధ్యాలు, సమస్యలు రాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎస్‌పి తుషార్ డూడి మాట్లాడుతూ మత్స్యకారుల కోరిక మేరకు గతంలో వారిపై పెట్టిన కేసులను రద్దు చేశామని తెలిపారు. ఇరువర్గాల మధ్య సమస్యను పరిష్కరించడానికి కొంత సమయం పడుతుందని, ఇందుకు సంయమనం పాటించాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్ జి గంగాధర్ గౌడ్, మత్స్యశాఖ డిడి గాలి దేవుడు, డ్రైనేజీ ఎస్సీ మురళీకష్ణ, సర్వే శాఖ ఏడి కనకరాజు, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాఘవరెడ్డి, బాపట్ల ఆర్డిఓ పి గ్లోరియా, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, బాపట్ల ఎమ్మార్వో సలీమా, చీరాల ఎమ్మార్వో గోపికష్ణ, మత్స్య శాఖ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వేలంపాట నిర్వహిస్తున్న దశ్యం

బైకులకు వేలం పాట

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ పోలీస్ స్టేషన్ లో నిర్వీర్య స్థితిలో ఉన్న 48 బైకులను బుధవారం వేలం పాట నిర్వహించారు. మొత్తం 48 వాహనాలను రూ.1,38,575 వేలంలో పాడుకున్నారు. వేలం ద్వారా వచ్చిన నగదును తహశీల్దారు పుల్లారావు ద్వారా గవర్నమెంట్ ట్రెజరీ అకౌంట్‌లో డిపాజిట్ చేయనున్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో తహశీల్దారు, పుల్లారావు, డిప్యూటీ తహశీల్దారు ప్రసాద్, ఎస్ఐ బి.మహేంద్ర, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

అధికారులకు జెసి ఆర్ గోపాలకృష్ణ ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్థానిక పోలీసు పెరేడ్ గ్రౌండ్స్‌లో ఈనెల 15న నిర్వహించబోయే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని సంయుక్త కలెక్టర్ ఆర్ గోపాల కృష్ణ అధికారులను ఆదేశించారు. పోలీసు పరేడ్ గ్రౌండ్‌ను ఆయన బుధవారం సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించారు. ఆయా శాఖల అధికారులు నిర్వర్తించాల్సిన విధులను వివరించారు. పోలీసు గౌరవ వందనం, కవాతు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రముఖులు, ప్రజా ప్రతినిధులకు సీటింగ్ ఏర్పాట్లు, ఆహ్వానం, స్వాతంత్ర్య సమరయోధులను గుర్తించి వివరాలు సిద్ధం చేయాలని అన్నారు. ఉద్యోగులకు



అధికారులకు సూచనలిస్తున్న జెసి ఆర్ గోపాలకృష్ణ

అందించే ప్రశంసా పత్రాల విషయంలో కాలయాపన లేకుండా ముందుగానే అవసరమైన ఏర్పాట్లు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమం, అభివృద్ధిని ప్రతిబింబించేలా, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలతో శకటాలు, స్టాళ్ల ప్రదర్శన ఉండాలని అన్నారు. జిల్లా సాధించిన ప్రగతిని వివరించేలా స్టాల్ ఏర్పాటు చేయాలని సూచించారు. దేశభక్తిని చాటే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. వర్షాల వల్ల ఎలాంటి అవరోధం కలగకుండా రెయిన్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. హాజరైన వారికి స్నాక్స్, తాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఆయా శాఖల అధికారులకు కేటాయించిన విధులు సమన్వయం చేసుకుంటూ వేడుకలు విజయవంతం చేసేందుకు కృషి చేయాలని అన్నారు. సమావేశంలో డిఆర్‌ఓ చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డీఒ కె లక్ష్మీ ప్రసన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్ రెడ్డి, జాన్సన్, డ్వామా, డిఆర్‌డిఎ పిడిలు జి జోసఫ్ కుమార్, నారాయణ, డిఇఒ ఎ కిరణ్ కుమార్, జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ బి రవి, గనులు, భూగర్భ, జల శాఖ ఉప సంచాలకులు టి రాజశేఖర్, జిల్లా ఉద్యాన శాఖాధికారి గోపీచంద్ పాల్గొన్నారు.

పిఎన్‌డిటి చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో రిజిస్టర్ స్కాన్ సెంటర్లు గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షల చట్టాన్ని (పిసి, పిఎన్‌డిటి) అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిఆర్‌ఒ బి చిన ఓబులేసు హెచ్చరించారు. స్థానిక డిఆర్‌ఒ ఛాంబర్‌లో పిసి, పిఎన్‌డిటి చట్టం జిల్లా స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. జిల్లాలోని రిజిస్టర్ స్కాన్ సెంటర్స్‌ను విధిగా తనిఖీ చేయాలని అన్నారు. ఎవరైనా ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భస్థ శిశువును కాపాడవలసిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో పిసిపిఎన్‌డిటి చట్టాన్ని పటిష్టంగా అమలు పరుస్తున్నామని అన్నారు. ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా స్కాన్ సెంటర్స్ నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పిసి, పిఎన్‌డిటి నోడల్ అధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్ జిల్లాలో అమలవుతున్న చట్టానికి సంబదించిన వివరాలు వెల్లడించారు. అన్ని స్కాన్ సెంటర్స్, ప్రవేట్ ఆసుపత్రుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామని అన్నారు. గర్భస్థ నిర్ధారణ పరీక్షలు జరిగినట్లు తెలిసిన వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వైద్య, ఆరోగ్య, మహిళా, శిశు సంక్షేమ, పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి పిసి, పిఎన్‌టిడి



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌ఒ బి చిన ఓబులేసు

చట్టాన్ని అమలు చేయాలని కోరారు. జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్ మాట్లాడుతూ పిసి, పిఎన్‌టిడి చట్టంపై అవగాహన కార్యక్రమాలు గ్రామాల్లో నిర్వహించాలని అన్నారు. అవసరమైన పోస్టర్, ఫ్లెక్సీలను అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, జన సమర్థం ఉన్న ప్రదేశాల్లో ప్రదర్శించాలని అన్నారు. పిసి, పిఎన్‌డిటి చట్టానికి సంబదించిన అన్ని రికార్డులు, రిజిస్టర్లు, అర్హులైన సిబ్బంది ద్వారా స్కాన్ సెంటర్లు ప్రదర్శించాలని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో డిఎస్‌పి రమణ కుమార్, సార్ట్స్ ప్రతినిధి డాక్టర్ లక్ష్మి, డాక్టర్ నబీవల్లి, జిల్లా మాస్ మీడియా అధికారి డి శ్రీనివాసులు. సరోజిని పాల్గొన్నారు.

రోడ్డుపై నాట్లు వేసి సిపిఎం నిరసన

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని అనంతవరంలో గత రాత్రి కురిసిన భారీ వర్షాలకు రోడ్లు మాగాణిని తలపిస్తున్నాయి. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రోడ్లపై వరి నాట్లేసి బుధవారం నిరసన తెలిపారు. రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు బొనిగల సుబ్బారావు మాట్లాడుతూ ఈపూరు నుండి అనంతవరం, తెనాలి ఆర్ అండ్ బి రోడ్డులో ప్రయాణం భయంకరంగా మారిందని అన్నారు. ఈ మార్గం చూస్తుంటే ఎక్కడో కొండ, కోనల గిరిజన ప్రాంతాల్లోని రోడ్లలాగా ఉందని అన్నారు. అనంతవరం ఆర్ అండ్ బి రోడ్డు విషయంలో అధికారులు ప్రకటనలతోనే కాలయాపన చేస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి ఎక్కడ చూసినా ఇలాగే ఉందని తెలిపారు. బొద్దులూరు పాడు, తాడిగిరిపాడు, పోతర్లంక, తోకలవానిపాలెం, కిష్కిందపాలెం ఇలా చెప్పుకుంటూ పోతే రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉన్నాయని అన్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లు ఉందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న ప్రభుత్వం తమ గ్రామాల రోడ్లు మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సంక్రాంతి నాటికి గుంటలు లేకుండా రోడ్లు అభివృద్ధి చేస్తామని గొప్పలు చెప్పుకున్న



రోడ్లపై వరి నాట్లు వేసి నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రభుత్వం తమ గ్రామాల రోడ్లు ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు గడుస్తున్నా రోడ్ల పరిస్థితి అతిగతి లేకుండా పోయిందని అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంతో ప్రతి గ్రామానికి రోడ్లు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన మాట ఏమైందని ప్రశ్నించారు. రోడ్లన్ని కదిలించడం, తిరిగేయడం తప్ప ఇంతవరకు ఏమి చేయలేదని అన్నారు. అరకొర పనులు చేసి మొత్తం పూర్తి చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు రోడ్ల మరమ్మతులు చేసి కొత్త రోడ్లు వేయని పక్షాన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జాలాది రంగారావు, ధూళిపాల వెంకటేశ్వర్లు, మోహనరావు, దూలపాల రామయ్య, మేడికొండ రమేష్, పాలపర్తి శ్రీనివాసరావు, చింతయ్య పాల్గొన్నారు.



సత్యమూర్తికి నివాళులర్పిస్తున్న డి రమాదేవి, గంగయ్య

కామ్రేడ్ సత్యమూర్తి మృతి తీరని లోటు

ప్రజాశక్తి - మేదరమెట్ల

కామ్రేడ్ మేడికొండ సత్యమూర్తి మృతి కార్మిక, కర్షక పోరాటాలకు తీరని లోటని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి రమాదేవి అన్నారు. మండలంలోని కుర్రవానిపాలెంలో సత్యమూర్తి అంతిమ యాత్ర ఎర్రజెండాతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్మికులు, కర్షకులు, పేదల కోసం అనేక పోరాటాలు చేసిన వ్యక్తి సత్యమూర్తి అన్నారు. సిపిఎంకు తీరని లోటని అన్నారు. చీరాల ఐఎల్‌టిడి కంపెనీలో పనిచేస్తూ శ్రామికుల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారని అన్నారు. సిపిఎంలో ఉంటూ గ్రామంలో అనేక సమస్యలపై ముందుండి యువతను నడిపించారని అన్నారు. అటువంటి కామ్రేడ్ నమ్మిన సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లడం అందరి బాధ్యతని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ మజుందార్, ఎన్ బాబురావు, ఎం వసంతరావు, జిల్లా నాయకులు పి కొండయ్య, మోంద్రు ఆంజనేయులు, బి దశరథ, వై రవీంద్రబాబు, ఎం పెద్ద సుబ్బారావు, బి విజయ్ కుమార్, జె యోహాన్ పాల్గొన్నారు.

యన్నం సురేష్‌కు సేవారత్న అవార్డు

ప్రజాశక్తి - భట్టిప్రోలు



యన్నం సురేష్

మండలంలోని పెసర్లంక గ్రామానికి చెందిన దళిత ఉద్యమ నాయకులు యన్నం సురేష్ ఈనెల 14న భారత సేవారత్న అవార్డు హైదరాబాద్ కళాభారతిలో నీతి ఆయోగ్‌చే నిర్ధారించబడిన మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందుకున్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కల్చరల్ ప్రోగ్రామ్స్, అవార్డుల ప్రధానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సురేష్ వివిధ రంగాల్లో చేసిన సేవలను గుర్తించి ఆయనకు 'భారత సేవారత్న' నేషనల్ అవార్డు, గౌరవ 'డాక్టరేట్' అందించనున్నారు. గత రెండు దశాబ్దాలు గా ఎస్సి, ఎస్టీ, బిసి, మైనార్టీల సమస్యలపై పోరాటాలు చేస్తున్నారు. వైపి రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ స్థాయి నుండి మహాసభ వరకు ఉన్న పలు పదవులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మిత్ర బృందం, బంధువులు అభినందించారు.



రియాజ్‌ను అభినందిస్తున్న నాయకులు

వుడా చైర్మన్‌కు అభినందనలు

ప్రజాశక్తి - వేటపాలెం

ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన అధ్యక్షులు షేక్ రియాజ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన చీరాల నాయకులు ఆర్‌కె నాయుడు, గొర్ల రఘురాం, తోట అశోక్ చక్రవర్తి, నూతక్కి రాకేష్, వాయిల రవి కుమార్ పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయ స్వామి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి హుండీల కార్యక్రమంలో భాగంగా బుధవారం అడిగొప్పల కార్యనిర్వాహణాధికారి పర్యవేక్షణలో లెక్కింపు చేశారు. స్వామివారికి 90 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలు రూ.40,79,791 ఆదాయం సమకూరిందని సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మదమంచి తిమ్మనాయుడు తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న నరేంద్ర వర్మ

వర్షపు నీటిని తక్షణమే తొలగించాలి

ప్రజాశక్తి - బాపట్ల

వరి పైరులో నిలిచిన వర్షపు నీరు మురుగు డ్రైన్ల ద్వారా పోయే విధంగా చర్యలు తీసుకోవాలని సాగునీటి సంఘం అధ్యక్షులకు శాసన సభ్యులు నరేంద్ర వర్మ సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. మండలంలోని కంకటపాలెం, జమ్ములపాలెం, నర్సాయిపాలెం ప్రాంతాల్లో వరి ఎద పెట్టిన వందల ఎకరాల్లో వర్షపు నీరు నిలిచింది. వరి పొలాల్లో నిలిచిన నీటిని తక్షణం తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులకు సూచించారు. టిడిపి అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, కంకటపాలెం పిఎసిఎస్ చైర్మన్ నక్కల వీర రాఘవయ్య పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

మండలంలోని విజయనగర్ కాలనీలో నివసిస్తున్న పుట్టుకతోనే రెండు కాళ్ల లేని అంబటి నాగేశ్వరరావు అనే దివ్యాంగునికి, చిమ్మిరిబండ గ్రామంలో నివసిస్తూ దీర్ఘకాల అనారోగ్యంతో బాధపడుతున్న దుడ్డు అంజయ్య, పెద్దమ్మాయి దంపతులకు హెల్పింగ్ హాండ్స్ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ ఖాదరవలి, పుట్టా అయ్యప్పస్వామి, కమిటీ సభ్యులు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు షేక్ భాషా కేబుల్, విశ్రాంత ఎస్ఐ కె హరిబాబు, బొల్లాపల్లి పౌలు, బెన్నిబాబు, వి అంజిరెడ్డి, తాళ్లూరి మార్తాశ్రీను, షేక్ అల్లాబక్షు, షేక్ హబిబా, జాష్టి సాంబశివరావు, ఎ రామారావు, ఎం జనార్ధన్ పాల్గొన్నారు.

సృజన సాహిత్య సమావేశం

ప్రజాశక్తి - అద్దంకి

సృజన సాహిత్య సమావేశం 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా శ్రీ కాళికా సమేత కమిటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించనున్నట్లు సృజన బాధ్యులు తెలిపారు. విద్వాన్ జ్యోతి చంద్రమౌళికి సన్మాన చేయనున్నట్లు తెలిపారు. దేశభక్తి గీతాలాపన, దేశభక్తి కవితలు ఉంటాయన్నారని కేశవమఠం అనిల్ కుమార్ సూరి, కొల్లి సురేంద్రబాబు తెలిపారు.

పొంగిన కొత్తకోట వాగు

- స్తంభించిన రాకపోకలు
- నీట మునిగిన మద్దిపాడు ఎంపిడిఒ కార్యాలయం

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు

అల్పపీడన ప్రభావంతో మంగళవారం రాత్రి నుంఇచ కురుస్తున్న వర్షంతో మండల పరిధిలోని కొత్తకోట వాగు పొంగి ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలు స్తంబించాయి. నాగులుప్పలపాడు నుంచి గ్రోత్ సెంటర్‌కు వెళ్లే రహదారిలో హనుమాపురం,కొత్తకోట వాగులు ఉన్నాయి.వర్షం పడినప్పుడల్లా ఆ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఫలితంగా ఆయా గ్రామాలకు వారం రోజుల పాటు బయట ప్రపంచంతో సంబంధాలు ఉండటం లేదు.గతఏడాది కూడా వర్షం కారణంగా కొత్తకోట వాగు పొంగి ప్రవహించింది. ఆ సమయంలో మండల పరిధిలోని ఒమ్మెవరం గ్రామానికి చెందిన గోగినేని హనుమంతరరావు అనే అధ్యాపకుడు విధులు వెళ్తూ కారుతో సహ కొట్టుకుపోయాడు. స్థానికులు గమనించి ఆయన ప్రాణాలను కాపాడారు.



పొంగిప్రవహిస్తున్న కొత్తకోట వాగు



మద్దిపాడు ఎంపిడిఒ కార్యాలయంలోకి చేరిన వర్షపు నీరు

మద్దిపాడు : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మద్దిపాడు ఎంపీడీవో కార్యాలయం నీట మునిగింది. కార్యాలయం వర్షపు నీటితో నిండి చిన్నపాటి చెరువు మాదిరిగా మారింది. నీరు కార్యాలయంలోకి వెళ్లడంతో కొన్ని ఫైల్స్ తడిసిపోయాయి. వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో విధులకు హాజరైన సిబ్బంది ఇబ్బందులకు గురయ్యారు. ఉద్యోగులు తమ కార్యకలాపాలు నిర్వహించలేక మధ్యాహ్నం మూడు గంటలకే వారి ఇళ్లకు వెళ్లిపోయారు.కార్యాలయం పై భాగం పెచ్చులూడి ప్రమాదకరంగా కూడా ఉంది. ఈ విషయం తెలుసుకున్న టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మందపల్లి శ్రీనివాసరావు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. కనీసం లోపలికి వెళ్లేందుకు కూడా వీలు లేకుండా ఉందని, ఉద్యోగుల పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే బిఎన్‌జవిజయ్ కుమార్ దష్టికి తీసుకెళ్తానని ఆయన తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి : డిఇఒ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

విద్యా హక్కు చట్టం- 2009లోని 12(1)(సి) నిబంధన ప్రకారం ప్రకాశం జిల్లాలో అన్నిప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీ కోసం 5 సంవత్సరాలు నిండిన అర్హులైన పిల్లలకు ఉచిత ప్రవేశాలు కల్పించనున్నట్లు డిఇఒ కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. అర్హులైన వారు ఈనెల 27లోపు ప్రభుత్వ పాఠశాల వెబ్ సైట్ లో లేదా సమీప గ్రామ/వార్డు సచివాలయం, మండల విద్యా శాఖాధికారి కార్యాలయం, మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అనాథలు, హెచ్‌ఐవి బాధితుల పిల్లలు, వికలాంగులు, ఎస్‌సి,ఎస్‌టి, మైనార్టీలు, బీసీలు, ఓబీసీలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారి వార్షిక ఆదాయం రూ.1,20,000, పట్టణ ప్రాంతాల ఆదాయం రూ.1,44,000 లోపు ఉండాలన్నారు.

అధికారులపై రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని ఉప్పుగుండూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సీరియల్‌లో ముందుగానే తమ పేర్లు నమోదు చేసుకున్నామని, ఇంత వరకూ తమ పేర్లు ఎందుకు రాలేదని బర్లీ పొగాకు రైతులు గోగినేని ప్రతాప్ , గుమ్మడి శ్రీను , బెల్లం శ్రీను అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము క్వింటా కూడా అమ్ముకోలేదని, వచ్చినవారి పేర్లే నాలుగుసార్లు వచ్చాయని, తమ పేర్లు ఎందుకు రాలేదని ఎఒ వెంకట్రావును ప్రశ్నించారు. దీంతో ఎఒ మాట్లాడుతూ పేర్లు నమోదు చేయడం వరకే తమ పని అని తెలిపారు. పైఅధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం చేసేవిధంగా ప్రయత్నిస్తామని తెలిపారు.

డ్రోన్ టెక్నాలజీపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-టంగుటూరు

రైతులు ఆధునిక సాంకేతికను అంది పుచ్చుకొని వ్యవసాయ రంగంలో అత్యధిక దిగుబడి సాధించాలని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయనిర్మల తెలిపారు. చతుకుపాడు రైతు సేవా కేంద్రం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శింగరాయకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు నిర్మల కుమారి డ్రోన్ టెక్నాలజీ వినియోగంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. డ్రోన్ ఉపయోగాలు, డ్రోన్ సహాయంతో మందులు పిచికారి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, నాయకులు , గ్రామ వ్యవసాయ సహాయకులు , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవయవ దానానికి అంగీకారం

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ అవయవదాన దినోత్సవ వేడుకలు స్థానిక డాక్టర్ చెరుకూరి వెంకటేశ్వర్లు ఇండోర్ స్టేడియంలో బుధవారం నిర్వహించారు. రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 డిజిట్నేటెడ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అవయవ దానం చేయడానికి రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు తొగటి శ్రీను, పారెళ్ళ శ్రీనివాసరావు, కడవ రామకష్ణ, చీమకుర్తి సునీల్ కుమార్ రెడ్డి, వీరారెడ్డి, నాగళ్ళ సత్యం, మరో తొమ్మిది మంది అంగీకార పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చెరుకురి వెంకటేశ్వర్లు, రామకష్ణయ్య, పి. రామకష్ణారెడ్డి, చిన్న వెంకటేశ్వర్లు, ఆదినారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందుకుంటున్న అభ్యర్థులు

ఉద్యోగాలకు 101 మంది ఎంపిక


ప్రజాశక్తి-శింగరాయకొండ

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య సంయుక్త సహకారంతో శింగరాయ కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మేళా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ రమాదేవి మాట్లాడుతూ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు చిన్న, పెద్ద కంపెనీ అని చూసుకోకుండా అనుభవం వచ్చేంత వరకు పని చేస్తే అభివద్ధి చెందుతారని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారి జె.రవితేజ మాట్లాడుతూ వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాల గురించి వివరించారు. నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడం ద్వారా మంచి ఉద్యోగాలను పొందవచ్చని సూచించారు. ప్రభుత్వం యవతీ, యువకులకు ఉపాధి కల్పించేందుక జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు ఈ జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ జాబ్ మేళాకు 252 మంది హాజరు కాగా అందులో 101 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అనంతరం ఎంపికైన వానికి నియమాక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు కోటేశ్వరరావు, ఉద్యోగ మేళా ఎపిఎస్‌సి ఎస్‌డిసి సిబ్బంది, హెచ్‌ఆర్ మరియు ఎంఐఎస్ శ్రీనివాసాచారి, స్కిల్ హబ్ కోఆర్డినేటర్స్ ఫిరోజ్ గాంధీ, షేక్‌బాషా, అనూష, విద్య సాగర్, గోపికష్ణ, నాయకులు కూనపరెడ్డి వెంకటసుబ్బారావు, చీమకుర్తి కష్ణ సుదర్శి ప్రసాదరావు, ఒలేటి రవిశంకర్‌రెడ్డి,కేతచంద్ర, కనిగిరి వెంకటేశ్వర్లు, ముళ్ళపూడి సత్యనారాయణ, అంబటి శ్రీను, గడిపినేని రవిచౌదరి, షేక్.యస్థాని, బొడ్డు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు అంబేద్కర్ నగర్‌కు చెందిన వైసిపి నాయకుడు తుల్లిబిల్లి రాజేష్ వివాహ వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ మంత్రి, వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్, పిడిసిసి బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పాల్గొని నూతన వధూ వరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైసిపి బూత్ కమిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు పుట్టా వెంకటరావు, ఎఎంసి మాజీ డైరెక్టర్ కొమ్ము సురేంద్ర, వైసిపి నాయకులు దుగ్గిరాల పేరాజ్ , తన్నీరు వీరనారాయణ , రావినూతల మనోహర్, తుల్లిబిల్లి క్రాంతి, దేవరపల్లి మురళీకష్ణ, పందిటి అశోక్ పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో మాజీ మంత్రి సురేష్, డాక్టర్ వెంకయ్య

కార్మికుల సేవలు మరువలేనివి : రమేష్

ప్రజాశక్తి-టంగుటూరు

ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా 8వ మహాసభ స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో గర్నపూడి అబ్రహం అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రమేష్ మాట్లాడుతూ పంచాయతీల్లో అత్యంత దుర్గంధంతో కూడిన మురుగు కాలువలు శుభ్రం చేస్తూ చెత్త, జంతు కళేబరాలు ఎత్తివేస్తూ పరిసరాలు శుభ్రంగా ఉంచటంలో పారిశుధ్య కార్మికులు చేస్తున్న కృషి మరువలేనిదని కొనియాడారు. కార్మికులల్లో ఎక్కువ మంది నిరుపేదలైన దళితులు ఉన్నారు. ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు నేరుగా జీతాలు చెల్లించకుండా ఆ భారాన్ని పంచాయతీలపై మోపుతున్నారు. దీంతో కనీస వేతనాలు అమలు కాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్మికులకు జీవో నంబర్ 36 ప్రకారం రూ.21 వేల వేతనం ఇస్తారని తెలిపారు. పంచాయతీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం జారీ చేసిన జీవోలు అమలు కావటం లేదు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన జీవ ప్రకారం రూ.18,000 ఇవాల్సి ఉందన్నారు.ఆ వేతనం కూడా ఇవ్వడం లేదన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ అమలు కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షుడు రాము, ఇత్తడి ధనమ్మ, పి.శ్రీను, ఎన్.ఎలీషా, దాచూరి ప్రకాశం, కె. శ్రీనివాసులు పాల్గొన్నారు



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పన్ను ఎగవేతదారులపై కేసులు నమోదు

- జిఎస్‌టి పరిధిలోకి రూ.20 లక్షల టర్నోవర్ వ్యాపారులు
- అధికారులకు కలెక్టర్ ఎ తమివమ్ అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో పన్ను ఎగవేత దారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా కమర్షియల్ ట్యాక్స్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కమర్షియల్ ట్యాక్స్ శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పన్ను పరిధిని రూ.40 లక్షల టర్నోవర్ విస్తరించటం (వస్తువుల విషయంలో), రూ.20 లక్షల టర్నోవర్ (సేవల విషయంలో) దాటిన వ్యాపార సంస్థలను జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. అటువంటి వ్యాపార సంస్థల సమాచారం కమర్షియల్ ట్యాక్స్ శాఖకు అందించాలని సూచించారు. మునిసిపల్ కమిషనర్లు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా రిజిస్ట్రార్, రెవెన్యూ అధికారులు, పన్ను బకాయిదారుల ఆస్తుల వివరాలు కమర్షియల్ ట్యాక్స్ శాఖకు అందించాలని సూచించారు. రూ.2.5 లక్షల విలువను మించిన సరఫరా ఒప్పందాలపై టిడిఎస్ మినహాయించి జిఎస్‌టిఆర్7 ద్వారా ప్రభుత్వానికి చెల్లించాలని సూచించారు. జిల్లాలోని డ్రాయింగ్‌లను డిస్బర్స్మెంట్ అధికారులతో టిడిఎస్‌పై అవగాహన సమావేశం నిర్వహించాలని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ తమిమ్ అన్సారియా

పన్ను లేకుండా సరుకుల రవాణా: గ్రానైట్, ఇతర సరుకుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రవాణా, మైనింగ్ శాఖలు కమర్షియల్ ట్యాక్స్ శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

డీజిల్ స్థానికంగా కొనుగోలు

కాంట్రాక్టర్లు డీజిల్‌ను స్థానికంగా ప్రామాణిక షెడ్యూల్ రేట్ల ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. తద్వారా రాష్ట్రానికి పన్ను ఆదాయం కాపాడ బడుతుందని సూచించారు. ఇంజనీరింగ్ అధికారులకు ఈ విషయంపై అవగాహన కల్పించాలని కోరారు. రూ.10లక్షల వార్షిక టర్నోవర్ దాటిన వ్యాపార సంస్థలు, డాక్టర్లు, ఆర్కిటెక్టులు వంటి ప్రొఫెషనల్స్ ప్రొఫెషన్ ట్యాక్స్ చెల్లించాలని సూచించారు. నెలకు రూ.15వేల కంటే ఎక్కువ జీతం పొందుతున్న ఉద్యోగులు ప్రొఫెషన్ ట్యాక్స్ చెల్లించాలని తెలిపారు. సమావేశంలో జెసి ఆఫ్ స్టేట్ ట్యాక్స్ వై కిరణ్‌కుమార్, డిసి ఆఫ్ స్టేట్ ట్యాక్స్ ఎం సత్యప్రకాష్, ఎసిలు, మైన్స్ డిడి టి రాజశేఖర్, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ టి వెంకటేశ్వర్లు, డిఇఒ ఎ కిరణ్ కుమార్, డిటిసి ఆర్ సుశీల, సిపిడిసిఎల్, ఇరిగేషన్ ఎస్‌ఈలు కట్టా వెంకటేశ్వరరావు, వరలక్ష్మి, పౌరసరఫరాల అధికారి ఎస్ పద్మశ్రీ, జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


కొత్త కార్యవర్గ సభ్యులతో ఎమ్మెల్యే దామచర్ల

అందరినీ కలుపుకొని.. బాగా పనిచేయాలి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం అందరిని కలుపుకొని బాగా పనిచేయాలని శాసన సభ్యులు దామచర్ల జనార్ధనరావు ఆకాంక్షించారు. స్థానిక టిటిడి కల్యాణ మండపంలో అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. అందరిని కలుపుకుంటూ ముందుకు సాగాలన్నారు. సామాజిక కార్యక్రమాల్లో సహాయం చేయాలని కోరారు. అసోసియేషన్ కార్యవర్గానికి ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు డి రోశయ్య, ఉపాధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి వెంకటేశ్వర్లుతో ఆయన స్వయంగా ప్రమాణం చేయించారు.




మాట్లాడుతున్న కోట వెంకటేశ్వరరెడ్డి

దేశభక్తి సామాజిక చైతన్య ప్రచారం

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా దేశభక్తి సామాజిక చైతన్య ప్రచారం బుధవారం నిర్వహించారు. నేటి తరంలో స్వాతంత్రోద్యమ లక్ష్యాలు, మహానాయకుల ఆశయాలు స్ఫూర్తిదాయకం కావాలని పలువురు అన్నారు. కార్యక్రమంలో పలపోలు నాగ మనోహర్ లోహియా, షేక్ సుభాని, బక్క ఎల్లారెడ్డి, తారా బాబురావు, డ్రైవర్ సాంబయ్య, పొన్నూరు శ్రీనివాసరావు, బి చైతన్యకుమార్, రామకృష్ణ, పర్వతనేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.


బాధితురాలును పరామర్శిస్తున్న బిసి సంఘం నాయకులు

బాధితురాలికి పరామర్శ

ప్రజాశక్తి - చీరాల

కారంచేడులో దాడికి గురైన రజక మూగ బాలిక పొదిలి దేవికను బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు స్థానిక ఏరియా ఆసుపత్రిలో బుధవారం పరామర్శించారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగ బాలికపై దాడి ఘటనను ఎట్టి పరిస్థితుల్లో సహించ రాదని అన్నారు. దాడికి పాల్పడిన వాళ్లను కఠినంగా శిక్షించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలబడతామని తెలిపారు. అవసరమైన న్యాయ, ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జువ్వా శివరాం, నాయకులు భగత్ సింగ్, జూపూడి శ్రీనివాసరావు, జనార్ధన్ పాల్గొన్నారు.

'మొక్కజొన్న'లో వర్షపు నీటిని తొలగించాలి

ప్రజాశక్తి - అద్దంకి

మొక్కజొన్న పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. మండలంలోని మైలవరం, ఉప్పలపాడు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంగళవారం కురిసిన భారీ వర్షాలకు మొక్కజొన్న సాగు చేసిన పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. 30 రోజుల్లోపు ఉన్న మొక్కజొన్న పొలాల్లో నీరు నిల్వ ఉంటే వెంటనే బయటకు వెళ్లగొట్టాలని, తేమ అధికంగా ఉన్న చోట ఎకరాకు 30కేజీల యూరియా, 25 కేజీల పొటాష్ చల్లుకోవాలని తెలిపారు. ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు. అన్నదాత సుఖీభవ ఎన్‌పిసిఐ ఇనాక్టివ్ ఉన్న రైతులు మండలంలో ఇంకా 158మంది రైతులు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దివికోలు రాధకృష్ణమూర్తి, భైరపునేని సుందరరావు, విఎఎ పవన్ సాయి, ఎఇఒ కోటేశ్వరరావు, ఆత్మ బిటిఎం శేషారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ


వర్షానికి కళకళలాడుతున్న మినుము

మెట్టపైర్లకు ప్రాణం పోసిన వర్షం

ప్రజాశక్తి - పంగులూరు

అల్పపీడనం కారణంగా రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షం మండలంలో మిట్టపైర్లకు ప్రాణం పోసింది. మండలంలో సాగుచేసిన మినుము, పత్తి, మొక్కజొన్న పంటలకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంతో మండలంలో ప్రస్తుతం 1200 ఎకరాల్లో మినుము, 150 ఎకరాల్లో మొక్కజొన్న, 30 ఎకరాల్లో పత్తి పంటల సాగు చేశారు. గత 15 రోజుల క్రితం కురిసిన వర్షానికి ఈ పైర్లను సాగు చేశారు. అయితే అప్పటి నుండి వర్షం లేకపోవడంతో పైర్లు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. ఈ పరిస్థితుల్లో మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షాలకు మళ్ళీ ప్రాణం పోసినట్లైందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలో 40 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు ఎఒ సుబ్బారెడ్డి తెలిపారు. రానున్న వారం రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచిస్తుందని తెలిపారు. భారీ వర్షాలకు పంటలు ఏమైపోతాయోననే ఆందోళన కూడా రైతులను పీడిస్తుంది. కొద్దిపాటి వర్షం జల్లులు కురిస్తే పైర్లకు ఎలాంటి ప్రమాదం ఉండదని, భారీ వర్షాలు కురిస్తే మాత్రం ప్రస్తుతం ఉన్న పంటలు దెబ్బ తినే ప్రమాదం ఉందని రైతులు, అధికారులు చెబుతున్నారు.

విద్యార్థినుల అదృశ్యం కేసు చేధించిన పోలీసులు

ప్రజాశక్తి - వేటపాలెం

ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం కేసును పోలీసులు చేధించారు. వివరాలను చీరాల రూరల్ సిఐ పి శేషగిరి రావు వివరించారు. స్థానిక బాలికోన్నత పాఠశాల్లో ఇంటర్మీడియట్ చదువుచున్న దేశాయిపేట, వేటపాలెం రైల్వే స్టేషన్ ప్రాంతాలకు చెందిన ఇద్దరు మైనర్ బాలికలు చిన్ననాటి స్నేహితులు. ఇద్దరికీ చదువుపై ఆసక్తి లేదు. తల్లిదండ్రులు బాగా చదువుకోమని మందలించడంతో ఈనెల 11న ఉదయం ఆ ఇద్దరు బాలికలు తమ తల్లిదండ్రులకు స్కూలుకు వెళ్తున్నట్టు చెప్పి స్కూలుకు వెళ్ళకుండా అదృశ్యం అయ్యారు. సాయంత్రం స్కూల్ తరువాత కూడా బాలికలు ఇంటికి చేరుకోకపోవడంతో బాలికల తల్లి, దండ్రులు స్కూల్ నందు విచారించారు. వారి కోసం వెతికి ఆచూకీ తెలియకపోవడంతో పోలీసు స్టేషన్లో బాలికలు అదృశ్యమైనట్లు పిర్యాదు చేశారు. ఎస్ఐ పి జనార్ధన్ కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు తెలిపారు. ఎస్పీ తుషార్ డూడి సూచనలతో 5 ప్రత్యేక బృంధాలను ఏర్పాటు చేశారు. చీరాల డిఎస్పి ఎండి మొయిన్ పర్యవేక్షణలో చీరాల రూరల్ సిఐ పి శేషగిరిరావు ఆధ్వర్యంలో అదృశ్యమైన బాలికల ఆచూకి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లా ఐటి కోర్ టీం సాంకేతికత సహకారంతో ఇద్దరు మైనర్ బాలికలు గుంటూరు రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఉన్నట్టు గుర్తించారు. ఇద్దరు బాలికలనూ కౌన్సిలింగ్ ఇచ్చి తహశీల్దారు ఎదుట హాజరుపర్చిన అనంతరం తల్లిదండ్రులకు అప్పగించినారు. తప్పి పోయిన ఇద్దరు బాలికల ఆచూకీని 24 గంటల్లో కనిపెట్టి కేసును చేధించిన చీరాల డిఎస్పి ఎండి మొయిన్, చీరాల రూరల్ సీఐ పి శేషగిరిరావు, వేటపాలెం, ఇంకొల్లు ఎస్ఐలు పి జనార్ధన్, జి సురేష్, స్పెషల్ టీం సిబ్బందిని ఎస్పీ తుషార్ డుడి అభినందించారు.


విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు


పంటలు పరిశీలిస్తున్న ఎఒ వి రవీంద్రబాబు

మునిగిన పొలాల పరిశీలన

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని అనంతవరం, చిన్నపులివర్రు, కొల్లూరు, క్రాప, రావికంపాడు, ఈపూరు గ్రామాల్లో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీట మునిగిన పంటలను ఎఒ వి రవీంద్రబాబు బుధవారం పరిశీలించారు. అధికంగా కురిసిన వర్షాలు వల్ల మునిగిన వరి పంటను సందర్శించారు. ఆయా గ్రామాల్లో 1025 ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్లు తెలిపారు. ఆమె వెంట గ్రామ వ్యవసాయాధికారులు ఉన్నారు.

నీట మునిగిన వరి చేలో పొటాష్ వేయాలి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

వర్షాల వలన చేలు నీట మునిగితే నీరు పోయిన తర్వాత మొదటి విడత చల్లే ఎరువుల్లో పొటాష్ ఎరువు కూడా వాడాలని బాపట్ల డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం ఉష రైతులకు సూచించారు. మండలంలోని బలుసులపాలెం, తుమ్మలపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. రేపల్లె ఎడిఎ ఎ లక్ష్మీ రైతులకు సూచనలు చేశారు. సహకార సొసైటీల్లో, పొన్నపల్లి మార్కెట్ యార్డులో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు తీసుకోవాలని తెలిపారు. ఏఈఓ రామకృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ ఉష

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న నగరం ఎంపిడిఒ బుర్ర శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నగరం

మండలంలోని 27 పంచాయతీల నందు 12వేల ఐఇసి పాంప్లెట్స్ ,150 గోడ ప్రతులు ఇంటింటికీ పంపిణీ చేశారు. ఎంపిడిఒ బుర్ర శ్రీనివాసరావు కరపత్ర ప్రతులను పంపిణీ చేస్తూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అన్ని గ్రామాల్లో శానిటేషన్, ఫాగింగ్ చేయాలని తెలిపారు.

చెరుకుపల్లి : ప్రస్తుతం విస్తృతంగా వ్యాపిస్తున్న డెంగ్యూ, సీజనల్ జ్వరాల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిం చాలని ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద పంచా యతీ, వైద్య సిబ్బందితో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ప్రజలకు అవగాహన కలిగేలా పాంప్లె ట్లు, పోస్టర్ల ద్వారా ప్రచారం చేయాలని తెలి పారు. ప్రజల్లో డెంగ్యూ, ఇతర సీజనల్ వ్యాధు లు పట్ల అవగాహన కల్పించేందుకు మండలా నికి 12వేల ప్లాంప్లెట్లు, 150 పోస్టర్స్ పంపిణీ చేశారని తెలిపారు. వాటిని ప్రతి నెల పెన్షన్స్ పంపిణీ చేసే సిబ్బంది ఇంటింటికి తిరిగి అంద జేయాలని తెలిపారు. పోస్టర్లను ముఖ్యమైన ప్రదేశాల్లో అంటించి వ్యాపారస్థు లకు అవగాహన కల్పించమని ఆదేశించారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వదలమని, ఎబాట్ ప్రతి ఇంటిలో, బయట, డాబాల మీద నీరు ఉండే ప్రదేశాల్లో స్ప్రే చేయించాలని తెలిపారు. నిలవ ఉన్న నీరు పారబోసి లార్వాలు పెరగకుండా చర్యలు తీసుకొనమని ఆదేశించారు. వాడేసిన కొబ్బరి బొండాలు, నాలుగు ముక్కలుగా చేసి నీరు నిల్వ ఉండకుండా జనా వాసానికి దూరంగా ఉంచాలని తెలిపారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్స్, పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు, ఇతర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భట్టిప్రోలు : డెంగ్యూ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు మేక శ్రీనివాసరావు అన్నారు. మండలంలో డెంగ్యూ కేసులు నమోదైన నేపథ్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ జె వెంకట మురళి సూచన మేరకు డిబిఆర్సి గత మూడు రోజులుగా ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయ సమీపంలోని హనుమాన్ పేటలో ఇంచార్జ్ ఎంపిడిఒ ఈ వినయబాబు ప్రారంభించారు. డెంగ్యూ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిబిఆర్సి ప్రతినిధులు వి భగవాన్ దాస్, ఎం శ్రీలత, ఆశ కార్యకర్తలు ఎన్వి రమణ, సరస్వతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భట్టిప్రోలు తహశీల్దారు శ్రీనివాసరావు

డ్రగ్స్ జోలికెళ్లి జీవితం పాడు చేసుకోవద్దు



డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పిస్తున్న సిఐ సుబ్బారావు

ప్రజాశక్తి - చీరాల

యువతలో వేగంగా వ్యాపిస్తున్న డ్రగ్స్ మహమ్మారిపై ప్రభుత్వం, పోలీసులు, సామాజిక సంస్థలు కలసి కఠిన చర్యలు ప్రారంభించాయని వన్ టౌన్ సీఐ సుబ్బారావు తెలిపారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు స్థానిక ఎన్వీఎస్ అండ్ ఎస్జెఆర్ కళ్యాణ మండపంలో డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యం, కుటుంబ, సామాజిక సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో డ్రగ్స్ అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేయబడ్డాయని తెలిపారు. సరిహద్దు ప్రాంతాలు, విమానాశ్రయాలు పోర్టుల్లో పోలీసులు తనిఖీలు కఠినతరం చేశారని అన్నారు. డ్రగ్స్ స్మగ్లింగ్‌కు పాల్పడిన వారికి కఠిన శిక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహనా సెమినార్లు, షార్ట్ ఫిల్మ్ ప్రదర్శనలు ఇస్తున్నామని అన్నారు. పునరావాస కేంద్రాలు కూడా డ్రగ్ వ్యసనగ్రస్తులకు చికిత్స, కౌన్సెలింగ్, వృత్తి శిక్షణ అందిస్తున్నాయి. తల్లి, దండ్రులు తమ పిల్లల ప్రవర్తనలో మార్పును గమనించి, ఆత్మీయ సంభాషణకు ప్రాధాన్యం ఇవ్వాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. తదుపరి విద్యార్థుల చే డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ వ్యతిరేక పోరాటం ఒక్కరితో సాధ్యం కాదని, ప్రతి పౌరుడు ఈ ఉద్యమంలో భాగస్వామి కావాలని తెలిపారు. కార్యక్రమంలో శక్తి టీం సబ్ డివిజన్ ఇంచార్జ్ ఎస్ఐ హరిబాబు, కె సుబ్బారావు, ఈగల్ టీం సభ్యులు సురేష్, శ్రీమేధావి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నగరం : ఎస్పీ తుషార్ డుడీ, రేపల్లె డిఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మండలంలోని పెద్దవరం జడ్పీ హైస్కూల్ నందు శక్తి యాప్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టాలు, యాంటీ డ్రగ్ అవగాహన సదస్సును శక్తి టీం బుధవారం నిర్వహించారు. రేపల్లె సబ్ డివిజన్ శక్తి టీం ఇంచార్జ్, నగరం ఎస్‌హెచ్ఓ బి భార్గవ్, ప్రొబేషన్ ఎస్ఐ షేక్ నజరీన్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, సిబ్బంది, సర్పంచ్ కోట హరేరామ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగరం ఎస్ఐ భార్గవ్


కృష్ణనది వరద ఉధృతి పరిశీలిస్తున్న తహశీల్దారు

పెనుమూడి బ్యారేజికి వరద ఉధృతి

ప్రజాశక్తి - రేపల్లె

ప్రకాశం బ్యారేజీకి నుండి దిగువకు నీటి ప్రవాహం అధికంగా ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు మోర్ల శ్రీనివాసరావు అన్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతాలైన పెనుమూడి, రావి అనంతవరం, చాట్రాగడ్డ గ్రామాల్లో వరద పరిస్థితిని అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. వరద ముప్పు ఉండే గ్రామాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలిపారు. అవసరమైతే ఆయా గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని అన్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని అన్నారు. గ్రామాల్లో మట్టి గోడలతో నిర్మించిన ఇళ్లలో నివసించే ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీటిమట్టం పెరుగుతున్నట్లు గుర్తించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని ప్రజలకు సూచించారు. ప్రజలు ఎవరు అధైర్య పడవద్దని అన్నారు. ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

వర్షంలో లోతట్టు ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి - చీరాల

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్లు, డ్రైతో పాటు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. ఆకాశానికి చిల్లు పడినట్లుగా కురిసిన భారీ వర్షంతో పట్టణ ప్రధాన వీధులు కాలువలను తలపించాయి. అత్యవసర పరిస్థితిని ఎదు ర్కొనేందుకు మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివ రావు మున్సిపల్ కార్యాలయంలోనే ఉండి అధికారులను పురమాయించారు. 27వ వార్డు బలహీన వర్గాల కాలనీ, 30, 31 వార్డులు, రోశయ్య కాలనీ, 1, 2, 3వార్డులు, హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంతాలో తిరిగి అక్కడ పరిస్థితులను అధికారులతో చర్చించారు. ఆయన వెంట మున్సిపల్ డిఈ రఘురాం, ఎఈ రవికిరణ్, శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న చైర్మన్ మించాల సాంబశివరావు

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - నగరం

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ అనుబంధ శాఖలతో కలిపి పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి వి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని తోటపల్లిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. రేపల్లె ఎడిఎ ఎ లక్ష్మి, బాపట్ల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం ఉషా క్షేత్ర సందర్శన చేశారు. వరి నారు మళ్లను పరిశీలించారు. వరి నారు నాటే ముందు కొసలు తుంచి నాటాలని తెలిపారు. రైతులు ఎరువులు వాడేటప్పుడు నత్రజని, భాస్వరం, పోటాష్ ఏ సమయంలో ఎంత మోతాదులో వాడాలి, నీటి యాజమాన్యం వివరించారు. ఎఇఒ కె నాగ శ్రీనివాసరావు, విఎఎ నాగ రమేష్ పాల్గొన్నారు.



నగరంలో మాట్లాడుతున్న రేపల్లె ఎడిఎ ఎ లక్ష్మి


మంత్రి సత్యప్రసాద్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

చీరాల కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - చీరాల

వెలగపూడి సచివాలయంలో జిల్లాల విభజన మంత్రుల కమిటీ సమావేశంలో చీరాల కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా సాధన సమితి ప్రతినిధులు బుధవారం వినతి పత్రం అందజేశారు. బాపట్ల జిల్లాకు స్వాతంత్ర్య ఉద్యమంలో చీరాల, పేరాల ఉద్యమ సారధి, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పేరు పెట్టాలని కోరారు. బాపట్ల జిల్లాను చీరాల కేంద్రంగా ఏర్పాటు చేయాలని, అది సాధ్యం కాకుంటే చీరాల, బాపట్ల మధ్య ప్రభుత్వ పరిపాలన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. సమితి కన్వీనర్ డాక్టర్ తాడివలస దేవరాజు, పట్టేం మనోహర్ మాట్లాడుతూ చారిత్రాత్మక, సాంస్కృతిక, వాణిజ్య, విద్య, వైద్య, రవాణా సౌకర్యాల పరంగా చీరాల అనువైన పట్టణమని వివరించారు. పర్చూరు, రేపల్లె, బాపట్ల, వేమూరు, అద్దంకి నియోజకవర్గాలకు సమదూరంలో ఉందని తెలిపారు. గతంలో చీరాల జిల్లా కేంద్రం కోసం తాము ప్రతిపాదనలు సమర్పించామని, అప్పటి ప్రభుత్వం బాపట్లను కేంద్రంగా ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇప్పటికీ శాశ్వత భవనాలు నిర్మించలేదని తెలిపారు. వెధుళ్లపల్లి, ఈపురుపాలెం మధ్య ఉన్న ప్రభుత్వ భూముల్లో కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు, జిల్లా కోర్టు, జైలు నిర్మిస్తే చీరాల, బాపట్ల జంట నగరాలుగా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న రేపల్లె ఆర్‌డిఒ రామలక్ష్మి

కృష్ణా నది వరదపై సమీక్ష

ప్రజాశక్తి - కొల్లూరు

ప్రకాశం బ్యారేజీకి వరద నేపథ్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో రేపల్లె ఆర్డీఒ రామలక్ష్మి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజీకి ప్రస్తుతం 3లక్షల క్యూ సిక్కుల నీరు కృష్ణా నదిలోకి వదిలినట్లు తెలిపారు. ఈ వరద గురువారంకు 4లక్షల క్యూసిక్కులు రావచ్చని తెలిపారు. అందువలన అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలోని కృష్ణా నది ప్రక్కనున్న ముంపుకు గురయ్యే లంక గ్రామారలైన గాజులలంక, పెసర్లంక, ఆవుల వారిపాలెం, పాతర్లంక వంటి గ్రామాలను గుర్తించి అధికారులు ఆ గ్రామాల ప్రజలకు సలహాలు, సూచనలు ఇవ్వాలని తెలిపారు. మరో నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరద ఉధృతి 7లక్షల క్యూ సిక్కులు రావచ్చని తెలిపారు. అందువలన అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గతేడాది వరద అనుభవాలు దృష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన చోట సిబ్బందిని మోహరించాలని అన్నారు. వరద ఉధృతి పెరిగితే రిలీఫ్ సెంటర్‌ను ముందుగానే గుర్తించాలని చెప్పారు. గ్రామాల్లోని వృద్ధులు, చిన్నపిల్లలు, బాలింతల వివరాలు ముందుగానే సేకరించాలని అధికారులను ఆదేశించారు. కరకట్ట మరమ్మతులు, మైనర్ రిపేర్లు గుర్తించి బాగు చేయాలని చెప్పారు. వరద వస్తే మూడు నెలలకు సరిపోను రైస్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దారు బి వెంకటేశ్వర్లు, ఎంపిడిఒ కె నరసింహారావు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



సమస్యలను మంత్రులకు వివరిస్తున్న మంత్రి స్వామి

వైసిపి ప్రభుత్వ హయాంలో

జిల్లాల విభజన ప్రక్రియ అస్తవ్యస్తం

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-శింగరాయకొండ

వైసిపి ప్రభుత్వ హయాంలో జిల్లాల విభజన ప్రక్రియను అస్తవ్యస్తంగా చేపట్టిందని, నెల్లూరు జిల్లాలో ఉన్న కొండపి నియోజకవర్గం లోని పలు గ్రామాలను తిరిగి ప్రకాశం జిల్లాలో కలపాలని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి జిల్లాల పేర్లు, సరిహద్దులు మార్పులపై ఏర్పాటైన మంత్రుల కమిటీని కోరారు. వెలగపూడి సచివాలయంలో మంత్రి వర్గ ఉప సంఘం సభ్యులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, బీసీ జనార్ధన్ రెడ్డి, సత్య కుమార్ యాదవ్‌ను మంత్రి స్వామి బుధవారం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కొండపి నియోజకవర్గ పరిధిలోని జరుగుమల్లి మండలం రామనాథపురం (ఎన్‌విపి కండ్రిక) ఓ వీధి ప్రకాశం జిల్లా, మరొక వీధి పలుకూరు పంచాయతీ నెల్లూరు జిల్లా పరిధిలో ఉందన్నారు. దీన్ని ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం నందనవనంలో కలపాలని కోరారు. జరుగుమల్లి మండల పరిధిలోని ఎడ్లూరుపాడు గ్రామం మండల కేంద్రానికి చాలా దూరంగా ఉందని, దీన్ని పొన్నలూరు మండలంలో కలపాలని కోరారు. ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలుకు మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం పరిసర గ్రామాలు చాలా దూరంలో ఉన్నాయని, ఏదైనా పనుల కోసం జిల్లా కేంద్రానికి ఆ ప్రాంత ప్రజలు రావాలంటే ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మార్కాపురం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేస్తే పశ్చిమ ప్రకాశం ప్రజలకు మేలు జరుగుందని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మంత్రి వర్గ ఉపసంఘానికి వివరించారు. ఆదిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ యాక్ట్) పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా సహాయ మార్కెటింగ్ సంచాలకులు ఎం.వరలక్ష్మి తెలిపారు. స్థానిక సహాయ మార్కెటింగ్ సంచాలకుల కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం యొక్క ప్రాముఖ్యత, వినియోగ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో వ్యవసాయ మార్కెట్ కమిటీల కార్యదర్శులు పాల్గొన్నారు.

భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించాలి
- కలెక్టరేట్లో 1077 నెంబర్‌తో కంట్రోల్ రూమ్
- కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాబోయే మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ఈ దిశగా తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ తహశీల్దార్లతో బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలు, కూలి పోయే అవకాశం ఉన్న పాత ఇళ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. చిన్నారులు, మహిళలు, గర్భిణులు, వృద్ధులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. స్థానికంగా ఉన్న కాలువలు, వాగులు, వంకలు, ఇతర నీటి వనరులు ఉదతంగా ప్రవహిస్తున్న చోట అటువైపుగా వెళ్లకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. విఆర్ఎ, విఆర్ఒలను ఆయా ప్రాంతాలలో కాపలాగా ఉంచాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలకు అత్యవసర సేవలు అందించేలా అప్రమత్తంగా ఉండాలని అన్ని శాఖల ఉన్నతాధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. . ఏదైనా సమస్య ఎదురైనా, సహాయం అవసరమైనా ప్రజలు వెంటనే జిల్లా అధికార యంత్రాంగం దష్టికి తీసుకువచ్చేలా కలెక్టరేట్‌లో 1077 టోల్ ఫ్రీ నెంబర్‌తో ఈనెల 16 వరకు 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇదేవిధంగా మండల, డివిజన్ల స్థాయిలోనూ కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అమెరికా సుంకాల భారం నుంచి

ఆక్వా రైతులను ఆదుకోవాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

అమెరికా విధించిన భారీ సుంకాలు ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా రంగాన్ని, ముఖ్యంగా రొయ్యల ఉత్పత్తిదారులను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ ఆక్వా రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం నాయకులు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడును బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు.కౌలు రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. హరిబాబు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కష్ణయ్య, ఆక్వా రైతుల సంఘం ప్రతినిధి బి.బలరాం మంత్రిని కలసి రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆ దృష్టికి తీసకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఉత్పత్తి అవుతున్న మొత్తం 9 లక్షల టన్నుల రొయ్యల్లో 70 శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే వస్తుందన్నారు. పశ్చిమ, తూర్పు గోదావరి, కష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాలు ప్రధాన ఉత్పత్తి కేంద్రాలుగా ఉన్నాయన్నారు. 6 లక్షల ఎకరాలకు పైగా చేపలు, రొయ్యల సాగు జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 3.5 లక్షల మంది ఆక్వా రైతులు జీవనాధారం పొందుతున్నారని తెలిపారు. రాష్ట్రం నుంచి ప్రతిఏడాది వేల కోట్ల రూపాయల విలువైన రొయ్యలు ఎగుమతి అవుతున్నట్లు తెలిపారు. అందులో సుమారు రూ.16,000 కోట్ల ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి అవుతున్నట్లు తెలిపారు. తద్వారా కేంద్రానికి విదేశీ మారకద్రవ్యం, రాష్ట్రానికి పన్నులు, మార్కెట్ సెస్‌ల రూపంలో కోట్ల ఆదాయం వస్తుందన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 50 శాతం సుంకం ఆక్వా రంగానికి పెద్ద దెబ్బ అవుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమెరికాతో చర్చలు జరిపి, ప్రత్యామ్నాయ ఎగుమతి మార్గాలు అన్వేషించాలన్నారు. అమెరికా ఆంక్షలు రద్దుకు కేంద్రం చొరవ చూపాలన్నారు. దీనికి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు. ఎక్స్‌లెన్సీ నిధుల వినియోగం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తక్షణంగా చర్యలు చేపట్టాలని కోరారు.ఈ అంశం పై మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ ఈ సమస్య పై ఈరోజే అధికారులతో సమీక్షిస్తామని తెలిపారు. ఆక్వా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు, రైతు సంఘ నేతలు పాల్గొన్నారు.



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న నేతలు